సాక్షి చిత్తూరు

శుక్రవారం । 27 । జూన్ । 2025



అంతా మా ఇష్టం!

కుప్పం ఉపకాలువ పనుల పర్యవేక్షణకు ఇద్దరే అధికారు లు నియమించి. ఉన్నతాధి కారులు స్వామిభక్తి చాటుకున్నారు

- 8లో



అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

బైక్‌లను చోరీ చేసే ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను నగరి పోలీసులు గురువారం అరెస్టు చేశారు.

- 8లో



టీడీపీలో కుమ్ములాట

శ్రీకావేరిరాజపురంలో టీడీపీ గ్రామస్థాయి కమిటీ నియామకంలో ఆ పార్టీలోని ఇరువర్గాలు కుమ్ములాడుకున్నాయి.

- 8లో

న్యూస్‌రీల్

వివాదాస్పద భూమి పరిశీలన

నదుం: మండలంలోని గాదేవారిపల్లెలో వివాదాస్పద భూమిని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ గురువారం పరిశీలించారు. మండలంలోని గాదేవారిపల్లెకు చెందిన సుబ్బరాజు, సుకన్య మధ్య గత కొంతకాలంగా డీకేటీ భూమికి చెందిన వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో వారు కోర్టును సైతం ఆశ్రయించారు. ఈ క్రమంలో 1.25 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఆ భూమిని కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం పరిశీలించారు. రెవెన్యూ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై నివేదిక అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రమీల, ఎస్ఐ షేక్ షావలి పాల్గొన్నారు.

డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్‌గా రవిశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని కార్వేటినగరం ప్రభుత్వ డైట్ కళాశాలలో సీనియర్ క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్న రవిశేఖర్‌కు ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు వైఎస్సార్ కడప జిల్లా ఆర్జేడీ శామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు. సీనియర్ క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతి కల్పించి, చిత్తూరు డీఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా నియమించారు. ఆయన గతంలో డీఈఓ కార్యాలయం, జిల్లా సమగ్రశిక్ష శాఖ కార్యాలయాల్లో జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించారు. ఉద్యోగోన్నతి పొందిన ఆయనకు పలువురు విద్యాశాఖ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కార్యదర్శుల బదిలీ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను చిత్తూరు నగర కమిషనర్ పి నరసింహ ప్రసాద్ గురువారం విడుదల చేశారు. వార్డు కార్యదర్శుల బదిలీల ప్రక్రియ ఈనెల 30వ తేదీ లోపల పారదర్శకంగా, ఎలాంటి ఫి ర్యాదులు లేకుండా పూర్తి చేయాలని గ్రామ వా ర్డు సచివాలయ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల మే రకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని తిరుపతి, చిత్తూరు నగరపాలక సంస్థలు, మదనపల్లి, శ్రీకాళహస్తి, పలమనేరు, పుంగనూరు, నగిరి, పుత్తూరు, కుప్పం పురపాలక సంఘాల పరిధి లోని వార్డు కార్యదర్శుల బదిలీలకు సంబంధించి జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. చిత్తూరు నగరపాలక పరిధిలోని చిత్తూరు నాగ య్య కళాక్షేత్రంలో ఈ నెల 27, 28 తేదీల్లో బది లీల కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. 27వ తేదీ 10.30 గంటల నుంచి వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ, వార్డు అమినిటీ సెక్రటరీ, వా ర్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేటరీ సెక్రటరీలకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఈనెల 28న ఉదయం 10.30 గంటల నుంచి వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వార్డు శానిటేషన్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రి య సజావుగా సాగేందుకు వీలుగా నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు కౌన్సెలింగ్ నిర్వహణకు సిబ్బందిని కేటాయించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ల్యాభార్జన



లాభార్జనే ధ్యేయంగా ల్యాబ్‌లు నడుపుతున్న నిర్వాహకులు రోగులకు ఉన్న వ్యాధి సంగతి అటుంచితే కొత్తది అంటగడుతున్నారు. వీరి పొరపాట్ల కారణంగా రోగులు కొన్ని సందర్భాల్లో ప్రాణం మీదకు తెచ్చుకున్న సంఘటనలు లేకపోలేదు. పాథాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ నిపుణులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఫలితాలను ధ్రువీకరించాలి. కానీ అర్హతలేని వారు పరీక్షలు చేస్తున్నారు. కొందరు వైద్యులు, ప్రభుత్వాస్పత్రుల్లో సిబ్బంది ల్యాబ్‌ల యాజమాన్యాలతో కుమ్మక్కై ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు.

- ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌ల నిర్వాహకులు ఇష్టారాజ్యం
- పలు రకాల పరీక్షల పేరుతో భారీగా ఫీజులు వసూలు
- వైరల్ జ్వరానికి సైతం మలేరియా, డెంగీ పరీక్షలు
- అనుమతి లేని ల్యాబ్‌లు, శ్యాంపిల్ కలెక్షన్ సెంటర్లు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో ప్రైవేటు వైద్యులు, డయోగ్నస్టిక్ కేంద్రాలు, ల్యాబ్‌ల నిర్వాహకులు, రోగుల నుంచి అందినంత దోచేస్తున్నారు. వైరల్ జ్వరంతో ఆస్పత్రికి వెళ్లిన బాధితులకు మలేరియా, డెంగీ, టైఫాయిడ్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ఆస్పత్రిలో ల్యాబ్ లేకపోతే.. ఫలానా ల్యాబ్‌కు వెళ్లాలని సిఫారసు చేస్తున్నారు. ఇక ప్రైవేటు ల్యాబ్‌ల నిర్వాహకులు నిర్ణీత ఫీజుల కన్నా రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల కనీస పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంతో ప్రైవేటు వైద్యులు, ల్యాబ్‌లు, డయోగ్నస్టిక్ కేంద్రాల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా రోగులు నుంచి డబ్బులు దండుకుంటున్నారు.

వీధికో ల్యాబ్

అధికారికంగా ల్యాబ్‌లు జిల్లాలో తక్కువే. అనధికారిక ల్యాబ్‌ల సంఖ్యను చూస్తే వేలాదిగా ఉంటాయి. వీధికో ల్యాబ్‌లో దర్శనమిస్తున్నాయి. ల్యాబ్‌లపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులు స్పందించడం లేదు. చిత్తూరులోని పొన్నియమ్మగుడివీధి, పలమనేరు రోడ్డు, కొంగారెడ్డిపల్లి, చర్చివీధి, సుందరయ్యవీధి, గిరింపేట, దర్గా సర్కిల్, పలమనేరు పట్టణ కేంద్రం, కుప్పం, నగరి, జీడీనెల్లూరు, ఎస్ఆర్‌పురం, యాదమరి, బంగారుపాళెం తదితర ప్రాంతాల్లో అనుమతి లేకుండా ల్యాబ్‌లు పుట్టగొడుగుల పుట్టుకొచ్చాయి.

అర్హత లేని వ్యక్తులతో పరీక్షలు

జిల్లాలో పలు ల్యాబ్‌లను పెథాలజిస్టులు లేకుండానే నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొన్ని ల్యాబ్‌ల్లో కనీస అర్హతలు లేనివారిని నియమించుకుని పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇటీవల చిత్తూరు మండలానికి చెందిన ఒక జ్వర పీడితుడు చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. డెంగీ నిర్ధారణ పరీక్ష చేసి, రక్తంలో ప్లేట్‌లెట్లు 40 వేలకు పడిపోయాయని చెప్పారు. దీంతో అతని కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి సమీపంలోని మరో ల్యాబ్‌లో పరీక్ష చేయించారు. రక్తంలో ప్లేట్‌లెట్లు 1.20 లక్షలు ఉన్నట్లు రిపోర్టు వచ్చింది. దీంతో సదరు ఆస్పత్రి సిబ్బందితో, బాధితుడి బంధువులు వాగ్వాదానికి దిగారు.

ధరల పట్టిక ఏదీ

ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి వైద్య పరీక్షకు అయ్యే ఖర్చులకు సంబంధించి ల్యాబ్‌లో అందరికీ కనిపించేలా ధరల పట్టిక ఏర్పాటు చేయాలి. ల్యాబ్‌లో పనిచేసే అసిస్టెంట్, పెథాలజిస్ట్ ఫొటోతో ఉన్న విద్యార్హత ధ్రువపత్రాన్ని రిసెప్షన్ వద్ద ఏర్పాటు చేయాలి. కానీ జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లో ఇవేవీ కనిపించవు. కొంతమంది వైద్యులు ఆస్పత్రి ఏర్పాటుకు అనుమతి పొంది, అనుమతి లేకుండా ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్యలోపంతో దోమలు వృద్ధి చెంది, ప్రజలు మలేరియా, డెంగీతోపాటు టైఫాయిడ్, వైరల్ జ్వరాల బారినపడుతున్నారు. ప్రభుత్వాస్పత్రులకు వెళితే వ్యాధి నిర్ధారణ పరీక్షలు జాప్యం అవుతున్నాయన్న ఉద్దేశంతో పట్టణ ప్రాంతాలకు చెందిన పలువురు జ్వర బాధితులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళుతున్నారు. కొంతమంది వైద్యులు మలేరియా, డెంగీ, టైఫాయిడ్ నిర్ధారణతోపాటు షుగర్, మూత్ర పరీక్షలు కూడా చేయించుకోవాలని సూచిస్తున్నారు. ల్యాబ్‌లో టైఫాయిడ్, మలేరియా నిర్ధారణ పరీక్షలకు రూ.100 నుంచి రూ.150 తీసుకోవాల్సి ఉండగా రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్నారు. డెంగీ బారిన పడితే రక్త పరీక్షకు (ప్లేట్‌లెట్స్ కౌంట్) రూ.800 నుంచి రూ.వెయ్యి, థైరాయిడ్ పరీక్షకు రూ.600 నుంచి రూ.800 వరకు వసూలు చేస్తున్నారు.

రెఫర్ చేస్తే ఆఫర్



జిల్లాలో వైద్య, ఆరోగ్య శాఖ అనుమతితో 900 క్లినిక్‌లు, 147 ల్యాబ్‌లు, డయోగ్నస్టిక్ సెంటర్లు, 20 పాలీక్లినిక్‌లు, 250 ఆస్పత్రులు ఉన్నాయి. కానీ ఎటువంటి అనుమతులు లేని డయోగ్నస్టిక్ సెంటర్లు, ల్యాబ్‌లు, ఆస్పత్రులు రెట్టింపు సంఖ్యలో ఉన్నాయి. వైద్యులు, ల్యాబ్‌ల నిర్వాహకులు కుమ్మక్కై అవసరం లేని వైద్య పరీక్షలు చేయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ల్యాబ్‌ల నిర్వాహకులు పరీక్ష ఫీజుల రూపంలో వసూలు చేసే సొమ్ములో 20 నుంచి 40 శాతం వరకు సంబంధిత వైద్యులకు కమిషన్‌గా అందజేస్తున్న విషయం బహిరంగ రహస్యమే. చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి ఎదురుగా కొంతమంది రక్త పరీక్షల పేరుతో అనుమతులు లేకుండా ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. వీరికి ఈ ఆస్పత్రిలో పనిచేసే కొందరితో సంబంధాలున్నాయి. ఆస్పత్రిలో చేయలేని పరీక్షలు బయట వ్యక్తులు వచ్చి చేసుకుని వెళుతున్నారు. ఇందుకు ప్రతిఫలంగా ల్యాబ్ నిర్వాహకులు మామూళ్లు ఇచ్చుకుంటున్నారు. ఒక్కో పరీక్షకు రూ. 200 నుంచి రూ.500 వరకు రెఫర్‌కు ఆఫర్ ఇస్తున్నారు.

చట్టపరమైన చర్యలు తప్పవు



ప్రైవేటు ఆస్పత్రులు, డయోగ్నస్టిక్ సెంటర్లు, ల్యాబ్‌ల ఏర్పాటుకు వైద్య, ఆరోగ్య శాఖ నుంచి అనుమతులు తప్పనిసరిగా పొందాలి. అనుమతి లేకుండా నిర్వహిస్తున్నట్టు తనిఖీల్లో గుర్తిస్తే చట్టపరమైన చర్యలు చేపడతాం. రక్త పరీక్షలకు అధిక మొత్తం వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టం. ధరల పట్టిక ఉండాలి.

–సుధారాణి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

సెలవు విషయంలో నిమిషానికో నిర్ణయం

- గందరగోళం సృష్టించిన డీసీఈబీ
- బడులు వదిలేశాక పాఠశాలలున్నట్లు మెసేజ్‌లు
- నేడు పాఠశాలలు పనిచేస్తాయి



ఎస్టీయూ గ్రూప్‌లో పెట్టిన మెసేజ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం (డీసీఈబీ) శాఖ పనితీరుపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. జిల్లాలోని పాఠశాలలకు ఈ నెల 27వ తేదీన సెలవు ప్రకటించే విషయంలో డీసీఈబీ అధికారులు గందరగోళం సృష్టించారు. ఆ శాఖ సెక్రటరీ బుధవారం డీసీఈబీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో అకడమిక్ క్యాలెండర్‌లో ఇవ్వాల్సిన ఐదు ఆప్షనల్ సెలవులతో నిర్ణయం తీసుకున్నారు. తొలి ఆప్షనల్ సెలవుగా ఈ నెల 27వ తేదీన జిల్లా మొత్తానికి సెలవు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత మరోసారి ఆప్షనల్ సెలవు అనేది జిల్లా మొత్తానికి వర్తించదని, స్కూల్ యూనిట్‌కు మాత్రమే వర్తిస్తుందని ప్రకటించారు. జిల్లాలోని పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లు కచ్చితంగా ఆప్షనల్ సెలవును లీప్ యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. లేని పక్షంలో ఆబ్సెంట్‌గా పరిగణిస్తామని తెలిపారు. ఈ ఆదేశాలు పాఠశాలలు ముగిసిన తర్వాత పంపారు.

ఆర్జేడీ మరో మెసేజ్

ఈ ఆప్షనల్ సెలవు విషయంలో వైఎస్సార్ కడప జిల్లా ఆర్జేడీ శామ్యూల్ మరో మెసేజ్ పంపారు. ఆప్షనల్ సెలవు అనేది కేవలం ఉద్యోగి వ్యక్తిగతమని, ఇది పాఠశాల మొత్తానికి సంబంధించింది కాద ని పేర్కొన్నారు. ప్రత్యేకించి పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్న సమయంలో పాఠశాలలకు ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ సెలవు ప్రకటించకూడదన్నారు. ఈ ఆదేశాలు కమిషనర్ ఉత్తర్వుల మేరకు తెలియజేస్తున్న ట్లు పేర్కొన్నారు. ఇలా ఒక్కొక్కరు ఒక్కో ఆదేశాలు జారీ చేస్తూ గందరగోళం సృష్టించారు. ఆప్షనల్ సెలవులను అమలు చేసే విషయం విద్యాశాఖ అధికారులకు ముందస్తుగా తెలియదా? అని పలువురు టీచర్లు ప్రశ్నిస్తున్నారు. నిమిషానికి ఒక ఆదేశం ఇచ్చి గందరగోళం ఎందుకు సృష్టించాలని మండిపడుతున్నారు. డీసీఈబీ సెక్రటరీ సొంత నిర్ణయం తీసుకోవడం సరికాదని టీచర్లు మండిపడుతున్నారు. చివరికి ఈ నెల 27వ తేదీన జిల్లాలో స్కూళ్లు పనిచేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

పదవులతో పార్టీని బలోపేతం చేయండి

- మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి : పార్టీ ఇచ్చిన పదవులను బాధ్యతగా భావించి, క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. గురువారం రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శిగా నియమితులైన చిరంజీవి పార్టీ నేతలతో మాజీమంత్రి నివాసానికి విచ్చేసి ఆమెను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రోజా వారితో మాట్లాడుతూ పార్టీ గుర్తించి ఇచ్చిన పదవులను ప్రతి ఒక్కరు బాధ్యతగా స్వీకరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రజలకు అండగా నిలబడి వారి తరఫున పోరాడాలన్నారు. ప్రభుత్వం చేసే తప్పులను, సంక్షేమ పథకాల అమలులో చోటుచేసుకునే అవకతవకలను ఎప్పటికప్పుడు ఎండ కడుతూ పేద వారికి న్యాయం జరిగేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ, మండల ప్రజాప్రతినిధులు, పార్టీ కన్వీనర్లు, రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాజీ మంత్రిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

మామిడి సబ్సిడీపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మామిడి రైతులకు ప్రభుత్వం అందజేసే రూ.4 సబ్సిడీపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తోతాపురి మామిడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఇస్తున్న రూ.4 సబ్సిడీని రైతులకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో గతంలో పండే దాదాపు 70 వేల మెట్రిక్ టన్నుల మామిడిని వ్యాపారవేత్తలు నేరుగా మామిడి తోటలకే వెళ్లి కొనుగోలు చేసే వారన్నారు. ప్రస్తుతం ర్యాంప్‌ల వద్ద కొనుగోలు తగ్గిందని చెప్పారు. కుప్పం, పలమనేరు నియోజకవర్గాలలో మామిడి గుజ్జు పరిశ్రమలు లేవని, ఈ కారణంగా జిల్లాలోని ఇతర మామిడి గుజ్జు పరిశ్రమల వద్దకు రైతులు పోటెత్తుతున్నారన్నారు. మామిడి కాయల దిగుబడి పెరిగి డిమాండ్ తగ్గడంతో మార్కెట్‌లో మామిడి కాయల ధర తగ్గిందన్నారు. ప్రస్తుత పరిస్థితి కారణంగా రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో మార్కెట్ ధరకు అనుగుణంగా రూ.4 సబ్సిడీని రైతుల వ్యక్తిగత ఖాతాలకు జమ చేయడం జరుగుతోందన్నారు. మండలాల్లో ఉన్న ర్యాంప్‌లను మండల వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ అసిస్టెంట్లు తప్పనిసరిగా తనిఖీలు చేయాలన్నారు. షిఫ్టుల ప్రకారం పనిచేస్తున్న సిబ్బంది ర్యాంప్‌ల వద్ద రైతులు నిర్వహిస్తున్న అమ్మకాలను నిర్దేశించిన ప్రోఫార్మాలలో నమోదు చేసి, కలెక్టర్ కార్యాలయానికి పంపాలన్నారు. ఈ క్రాప్‌తో సంబంధం లేకుండా సబ్సిడీ అందించడం జరుగుతుందన్నారు. తోతాపురి మామిడి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రూ.4 సబ్సిడీని సద్వినియోగం అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. రైతు స్వయంగా మామిడి తోట నుంచి నేరుగా తమ పంటను వేరే రాష్ట్రాలకు సరఫరా చేసినప్పటికీ ఆ వివరాలను రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమాచారాన్ని విలేజ్ అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ అసిస్టెంట్లు రైతులకు అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

తల్లికి కూటమి పరీక్ష

కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది తల్లికి వందనం ఎగ్గొట్టేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఏ ముహూర్తాన ఈ పథకం అమలు చేసిందో కానీ క్షేత్రస్థాయిలో విద్యార్థుల తల్లుల్లు సమస్యలతో అల్లాడుతున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో చాలా మంది అర్హులకు ఈ పథకంలో కోత విధించారు. గతంలో అర్హులైన లబ్ధిదారులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో తల్లికి వందనం పథకంలో అనర్హులుగా గుర్తించారు. అలాగే విద్యుత్ బిల్లులు, కారు, ఐటీ వంటివి వర్తించనప్పటికీ చాలా మందిని అనర్హుల జాబితాలో చేర్చారు. దీంతో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని సచివాలయాల వద్ద అనర్హుల జాబితాలో ఉన్న తల్లులు అర్జీలను చేతపట్టుకుని క్యూ కట్టారు. ఈ పరిస్థితి చూస్తుంటే కూటమి ప్రభుత్వం తల్లులకు పరీక్ష పెట్టినట్టుంది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తల్లికి వందనం పథకంలో అనర్హులైన తల్లుల కష్టాలపై సాక్షి గ్రౌండ్ రిపోర్ట్ కథనం.

- సచివాలయాల వద్ద క్యూ కట్టిన అనర్హులు
- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీగా అర్జీలు
- రెండు జిల్లాల్లో 12 వేలకు పైగా దరఖాస్తులు
- అధికంగా విద్యుత్ బిల్లులు, కారు, ఐటీ కారణాలు
- వైఎస్సార్‌సీపీ సర్కారు పాలనలో పారదర్శకంగా అమ్మఒడి



పాలసముద్రం మండలంలోని సచివాలయంలో తల్లికి వందనం అర్జీలు ఇస్తున్న తల్లిదండ్రులు



చిత్తూరులోని గిరింపేట సచివాలయంలో అర్జీలు అందజేస్తున్న తల్లులు



చిత్తూరు కలెక్టరేట్ : తల్లికి వందనం పథకం.. తల్లులకు పరీక్షగా మారింది. పలు రకాల కారణాలతో పథకం అమలు కాకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. మొదటి జాబితాలో పథకం వర్తించని పిల్లలు రెండో జాబితాకు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే సచివాలయాల్లో గ్రీవెన్స్ స్వీకరిస్తుండడంతో పెద్ద ఎత్తున దరఖాస్తులు అందజేస్తున్నారు. ఎవరు ఏ సమస్యతో అనర్హత జాబితాలో ఉన్నారో పేర్ల వారీగా వివరణ ఉన్న జాబితాలను ఇప్పటికే సచివాలయాల్లో ప్రదర్శించడంతో వాటి ఆధారంగా తగు పత్రాలను జతచేసి గ్రీవెన్స్‌కు దరఖాస్తులు ఇస్తున్నారు. ఈ క్రమంలో జత చేయాల్సిన పత్రాల కోసం రెండు జిల్లాల్లోని గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ తల్లులు చక్కర్లు కొడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మఒడి పథకం ఏటా పకడ్బందీగా అమలు చేశారు. తల్లులకు ఎలాంటి సమస్యలు లేకుండా పారదర్శకంగా ఎంపిక చేసి, నేరుగా ఖాతాల్లో నగదు జమ చేశారు. ఒక వేళ పొందలేని వారికి తిరిగి మరోసారి అవకాశం కల్పించి, ఏటా డిసెంబర్‌లో అమ్మఒడి పథకం అందజేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తల్లికి వందనం అమలు చేసిన మొదటి సారే గందరగోళ పరిస్థితి తలెత్తేలా అర్హులకు నష్టం కలిగేలా పథకాన్ని అమలు చేసింది.

రెండు జిల్లాల్లో 12,589 అర్జీలు

చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని సచివాలయాల పరిధిలో 1,327 సచివాలయాల పరిధిలో 12,589 అర్జీలు పోటెత్తాయి. ఒక్క చిత్తూరు జిల్లాలోని 612 సచివాలయాల పరిధిలో 5,897 వరకు అర్జీలు వచ్చాయి. అర్జీల్లో ఎక్కువశాతం విద్యుత్ బిల్లుకు సంబంధించినవే. పథకం వర్తించని వారు విద్యుత్ కార్యాలయాల వద్దకు వెళ్లి ఏడాది విద్యుత్ వినియోగ బిల్లులు తీసుకుని అర్జీలతో జత చేయడం విశేషం. తమ పేరుపై అనేక విద్యుత్ మీటర్లు సీడింగ్ అయి ఉన్నాయని వాటిని తొలగించాలనే అర్జీలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్క చిత్తూరు జిల్లా ట్రాన్స్‌కో పరిధిలో సీడింగ్ సమస్య అర్జీలు 1,789 వరకు ఉండగా, తిరుపతి జిల్లాలో 1,815 వరకు ఉన్నాయి. తమ కారు విక్రయించినా పథకం అమలు కాలేదని అనేక అర్జీల్లో తల్లులు ప్రస్తావించారు. ఆదాయ పన్ను దరఖాస్తులదీ ఇదే తీరు. వివాహం తర్వాత తాము కుటుంబం నుంచి విడిపోయి విడిగా ఉంటున్నా ఉమ్మడి కుటుంబ సభ్యుల ఆదాయం చూపించి తీసేశారంటూ అర్జీల్లో అనేక మంది పేర్కొన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి అనేక మంది అర్జీలు దాఖలు చేశారు.

సర్టిఫికెట్లకు ఇబ్బందులు

చిత్తూరు జిల్లాలో మొత్తం 1,30,382 మందిని, తిరుపతి జిల్లాలో 2,10,407అర్హులుగా గుర్తించారు. ఈ రెండు జిల్లాల్లో దాదాపు 98748 మంది అనర్హుల జాబితాలో ఉన్నారు. రెండు జిల్లాల్లో అధిక శాతం మందికి విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ కాలేదు. అనర్హత జాబితాలో ఉన్న వారు సచివాలయాలు, పాఠశాలల చుట్టూ తిరుగుతున్నారు. గ్రీవెన్స్ దరఖాస్తుతోపాటు జత చేయాల్సిన సర్టిఫికెట్లను పొందడంలో ఆలస్యం అవుతుండడంతో ఇంకా సగం మందికిపైగా సవరణ/ ఫిర్యాదు దరఖాస్తులు సమర్పించాల్సి ఉందని తెలుస్తోంది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఎందుకంటే వేలల్లో అనర్హులుంటే కేవలం 12,589 అర్జీలు రావడమే అందుకు ఉదాహ రణ. సచివాలయ సిబ్బందికి తల్లికి వందనం గ్రీవెన్స్‌పై అవగాహన లేకపోవడంతో ఆయా కార్యాలయాల్లో సరైన సమాధానం చెప్పలేకపోతున్నారు.

వేల సంఖ్యలో పోటెత్తిన అర్జీలు

'తల్లికి వందనం' పథకం తమకు వర్తింపజేయాలంటూ చిత్తూరు, తిరుపతి జిల్లాల వ్యాప్తంగా వేల సంఖ్యలో అర్జీలు పోటెత్తుతున్నాయి. తమకు అర్హత ఉన్నా పలు కారణాలతో జాబితాలో పేర్లు లేకుండా చేశారంటూ వేలాది మంది తల్లులు సచివాలయాలకు క్యూకడుతున్నారు. ఎప్పుడో కారు విక్రయించినా కారు ఉందనే సాకుతో పథకం నుంచి తొలగించారని కొందరు.. విద్యుత్ బిల్లు 300 యూనిట్లు అధికంగా చూపడంతో డబ్బులు పడలేదని మరికొందరు.. మూడేళ్ల కింద ఆదాయపు పన్ను చూపించి డబ్బులివ్వలేదని ఇంకొందరు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలు, రేషన్‌కార్డు సమస్యలున్న కుటుంబాలు ఇలా రకరకాల కారణాలతో తమను పథకానికి దూరం చేశారంటూ వాపోతున్నారు. అర్హులుగా నిర్ధారించి డబ్బులివ్వాలంటూ దరఖాస్తులు చేస్తున్నారు. దీంతో ఇప్పటివరకు చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 12,589 మంది తల్లులు అర్జీలు దాఖలు చేశారు. వీరిలో అర్హులుంటే వచ్చేనెల 5వ తేదీన తిరిగి ప్రభుత్వం డబ్బులు జమచేయనుంది. ఈ నేపథ్యంలో అధికారులు మళ్లీ ఈ అర్జీలను పునఃపరిశీలిస్తున్నారు. ఈ పథకంలో సమస్యలు ఎదుర్కొంటున్న తల్లులకు క్షేత్రస్థాయిలో సరైన అవగాహన కల్పించడంలో జిల్లా యంత్రాంగం విఫలమైనట్లు కొట్టొచ్చినట్లు తెలుస్తోంది.

పరిశీలనలో అలసత్వం

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాల్సి ఉంది. అయితే ఆయా శాఖల అధికారులు పరిశీలనలో అలసత్వం చూపిస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కారు సంబంధిత అర్జీ సమస్యను ఆయా జిల్లా రవాణా శాఖకు నేరుగా సచివాలయాలు పంపి ఆరా తీస్తున్నాయి. అయితే ఆ అర్జీల పరిష్కారంలో ముందడుగు పడడం లేదు. ఆదాయ పన్ను అర్జీలను తహసీల్దార్లకు లాగిన్‌లో పంపుతున్నారు. ఆ అర్జీలను తహసీల్దార్లు అస్సలు పట్టించుకోవడం లేదు. కొంత మంది తహసీల్దార్లు పరిష్కరించి ఆర్డీఓ లాగిన్‌లకు పంపుతున్నారు. పనిఒత్తిడిలో ఉన్న ఆర్డీఓలు వాటిని పట్టించుకోని దుస్థితి ఉంది. విద్యుత్ బిల్లులకు సంబంధించిన అర్జీలను ఆ శాఖ అధికారులు తిరస్కరిస్తున్నారు. వీరికి పథకం వర్తించదని నిర్ధారించి, సచివాలయాల దశలోనే రెండోసారి అనర్హత కేటగిరీలో చేర్చుతున్నారు. ఈ నెలాఖరులోగా అర్హుల జాబితా పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే రెండు జిల్లాల్లో ఈ పథకంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించని దుస్థితి నెలకుంది.

క్లుప్తంగా

ఐదుగురు జూదర్ల అరెస్టు

చౌడేపల్లె: మండలంలోని పెద్దకొండామర్రి చెరువు కింద గల పొలాల్లో పేకాట ఆడుతున్న ఐదుగురు జూదర్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు గురువారం తెలిపారు. రహస్య సమాచారం మేరకు సిబ్బందితో కలసి పేకాట స్థావరంపై దాడులు చేయగా కేశవరెడ్డి, శ్రీనివాసులు, ముకుంద, లక్ష్మన్న, సహదేవను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5,100 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

తపాలా బీమా ఏజెంట్ల ఎంపికకు ఇంటర్వ్యూలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని తపాలాశాఖ పరిధిలో బీమా ఏజెంట్లుగా పనిచేయడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆ శాఖ సూపరింటెండెంట్ లక్ష్మణ తెలిపారు. పదో తరగతి పాసై 18 ఏళ్లు దాటిన వారు ఇందుకు అర్హులన్నారు. తపాలా, గ్రామీణ తపాలా జీవిత బీమా పాలసీలను బుక్ చేయాలన్నారు. ఆసక్తిదారులు జూలై 5వ తేదీ లోపు కార్యాలయ పనివేళల్లో చిత్తూరులోని ప్రధాన తపాలా కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



పల్లవి మృతదేహం

బంగారుపాళెం: విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఏఎస్ఐ రామచంద్రారెడ్డి తెలిపారు. ఏఎస్ఐ కథనం మేరకు.. పలమనేరు మండలం జగమర్ల గ్రామానికి చెందిన సుధాకర్, అతని భార్య పల్లవి బంగారుపాళెం మండలం నలగాంపల్లెకు చెందిన శ్యామల మామిడి తోటలో కాపలాగా ఉన్నారు. ఈ నెల 22న భర్త సుధాకర్ మద్యం సేవించి రావడంతో భార్య పల్లవి ప్రశ్నించింది. ఈ విషయంపై భార్య, భర్త గొడవలు పడ్డారు. దీంతో సుధాకర్ మొదట విషం తాగాడు, భయపడిన పల్లవి కూడా విషం తాగింది. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు భార్యాభర్తలను చికిత్స నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు. భర్త సుధాకర్ కోలుకోగా, భార్య పల్లవి(23) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంతా మా ఇష్టం!

- కుప్పం లైనింగ్ పనుల్లో రూ.169 కోట్ల పనులు ఆ ఇద్దరికే!
- ఇద్దరితో నాణ్యతా ప్రమాణాల పర్యవేక్షణ సాధ్యమా?
- ఏరికోరి వారినే నియమించిన ఉన్నతాధికారులు

మదనపల్లె: వడ్డించే వాడు మనోడైతే ఏ బంతిలో ఉన్నా కొరవుండదన్న సామెత హంద్రీ-నీవా ప్రాజెక్టులో భాగమైన చిత్తూరు జిల్లా కుప్పం ఉపకాలువ లైనింగ్ పనులకు అతికినట్టు సరిపోతుంది. ఈ లైనింగ్ పనులు చేపట్టింది అనకాపల్లె ఎంపీ సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్స్ సంస్థ, అందులోనూ సీఎం చంద్రబాబుకు సన్నిహితుడు కావడంతో ఇక చెప్పేదేముంటుంది. ఎవరేమనుకున్నా సరే మనోళ్లు, మనం చెప్పినట్టు వినేవాళ్లకు పనులు అప్పగిస్తే..ఇక అడ్డు అదుపు ఉండదనుకున్నారేమో.. సరిగ్గా అదే జరిగింది. రూ.169 కోట్ల విలువైన పనులను చూసే బాధ్యతను కేవలం ఇద్దరంటే ఇద్దరే అధికారులకు అప్పగించి, ఉన్నతాధికారులు స్వామి భక్తిని చాటుకున్నారు. అంతటిలో ఆగలేదు..మీ పనులు మీ ఇష్టం అన్నట్టుగా నాణ్యతకు తిలోదకాలు ఇచ్చేశారన్న విమర్శలు వినిస్తున్నాయి.

డివిజన్ అధికారిని తప్పించేసి..

హంద్రీనీవా ప్రాజెక్టు సబ్ డివిజన్ కేంద్రం కుప్పంలో ఉంది. దీనికి సెల్వరాజ్ డీఈగా స్థానికంగా ఉండి పని చేస్తున్నారు. వాస్తవానికి కుప్పం ఉపకాలువ లైనింగ్ పనుల్లో ఈయన కీలకంగా పని చేయాల్సి ఉంది. అయితే కాంట్రాక్టు సంస్థకు నచ్చలేదో లేక చెప్పినట్టు పని చేయరని అనుకున్నారో కాని కుప్పం లైనింగ్ పనుల బాధ్యత వహించాల్సిన సెల్వరాజ్‌కు ఒక్కశాతం బాధ్యత లేకుండా పూర్తిగా తొలగించి, పక్కన పెట్టారు. అయితే పూర్తిగా బాధ్యతలు అప్పగించకపోతే వివాదం రేగుతుందని అనుకున్నారేమో ఆయనకు చిత్తూరు జిల్లాలో పని కల్పించకుండా అన్నమయ్యజిల్లాలో జరుగుతున్న పుంగనూరు ఉపకాలువ పనుల్లో 12 కిలోమీటర్ల బాధ్యతలను అప్పగించి చేతులు దులుపుకున్నారు.



కుప్పం ఉపకాలువలో జరుగుతున్న లైనింగ్ పనులు

అంతా ఆ ఇద్దరికే..

రూ.169 కోట్ల విలువ కలిగిన 90 కిలోమీటర్ల కాలువ పనులు..అందులో లైనింగ్, షార్ట్ క్రీటింగ్ పనులు కీలకమైనవి. అయితే ఉన్నతాధికారుల కనుసన్నల్లో పనుల అప్పగింత వ్యవహారం సాగింది. పీబీసీ పనుల్లో ఐదుగురు డీఈఈలను నియమిస్తే..కుప్పం పనులకు అంతేమందిని నియమించాలి. అయితే ఇక్కడ నిబంధనలు పని చేయలేదు. డీఈ సెల్వరాజ్‌ను తప్పించాక..ఏరికోరి ఇద్దరికి బాధ్యతలు ఇచ్చారు. 90 కిలోమీటర్ల కాలువ పనులకు ఒకే ఒక్క డీఈగా గోవర్ధన్‌ను, ఒకే ఒక్క ఈఈగా వెంకటేశ్వర్లును నియమించారు. ఎక్కువ మంది ఉండాల్సిన జేఈల సంఖ్య కేవలం నాలుగుకే పరిమితం చేశారు. మిగిలిన ఎవరికీ ఈ పనుల్లో భాగస్వామ్యం కానీ, బాధ్యతలు కానీ అప్పగించకుండా దూరంగా ఉంచేశారు. కుప్పం లైనింగ్ పనులకు ఒక ఈఈ, ఒక డీఈకే పూర్తి కాలువ బాధ్యతలు అప్పగించిన ఉన్నతాధికారులు మరి పుంగనూరు ఉపకాలువ విషయంలో అలా వ్యవహరించలేకపోడం వెనుక కారణాలేమిటన్నది చర్చనీయాంశమైంది. ఇక్కడ ఐదుగురు డీఈలకు బాధ్యతలు ఇస్తే..90 కిలోమీటర్లకు ఒకే డీఈకి ఎలా బాధ్యత ఇచ్చారో..ఒక్కరే ఇంత పని ఎలా నిర్వహిస్తారని ఉన్నతాధికారులు భావించారో అర్థంకాని వ్యవహారంగా మారింది. పీబీసీ పని నామినేషన్‌పై అప్పగిస్తే..కుప్పం పనిని టెండర్ ద్వారా రెండు రీచ్‌లుగా పనులు చేపట్టారు. ఇలా అయినా కనీసం ఇద్దరు ఈఈలు, ఇద్దరు డీఈలైనా ఉండాలి. అలా కూడా లేకుండా ఒక్క డీఈనే నియమించారు.

పనులపై అనుమానాలెన్నో

కుప్పం ఉప కాలువ పనులను 2015లో చేపట్టిన అప్పటి టీడీపీ ప్రభుత్వం టెండర్ దక్కించుకున్న కాంట్రాక్ట సంస్థలోకి సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ కాంట్రాక్టు సంస్థకు భాగస్వామ్యం కల్పించడంతో పనుల వ్యవహారం అస్తవ్యస్తంగా మారడమే కాకుండా రూ.122 కోట్లను అదనం పేరుతో దోపిడీ చేశారు. ఈ పరిస్థితుల్లో లైనింగ్ పనుల కాంట్రాక్టు రిత్విక్ సంస్థకు దక్కడంతో దీనిపై ఎన్నో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పనుల పర్యవేక్షణ కేవలం ఒక డీఈకే అప్పగించడం, వాటి వివరాల నమోదు, నాణ్యత పరిశీలన తదితర అంశాల్లో పారదర్శకంగా సాగడం లేదన్న వాదన వినిపిస్తోంది.

కేబీసీ లైనింగ్ పనులివీ..

కుప్పం ఉపకాలువ(కేబీసీ)లో లైనింగ్ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేశాక రెండు కాంట్రాక్టు సంస్థలు టెండర్లలో పాల్గొనగా అందులో రిత్విక్ ప్రాజెక్ట్ సంస్థ అదనంగా టెండర్ దాఖలు చేయడంతో ప్రభుత్వం దాన్నే ఖరారు చేసి పనులు అప్పగించింది. రెండు రీచ్‌లుగా నిర్ణయించిన ప్రభుత్వం రూ.169,80,935తో 90.393 కిలోమీటర్ల కాలువకిరువైపులా సిమెంట్ లైనింగ్, అందులో 26.391 కిలోమీటర్లు షార్ట్ క్రీటింగ్ పనులు పూర్తి చేయాలి. మిగిలిన 64.002 కిలోమీటర్లు లైనింగ్ చేయాలి. ఈ పనులను వచ్చే ఫిబ్రవరి నాటికి పూర్తి చేయించాలన్నది లక్ష్యం. ఇందుకోసం పూర్తిస్థాయి సాంకేతిక అధికారులను నియమించి, పర్యవేక్షణ, నాణ్యతా ప్రమాణాల పాటింపు, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలి. అంటే ఇందుకు తగినంతమంది అధికారులను నియమించాలి. అయితే ఇక్కడ నిక్కచ్చిగా పనిచేసే అధికారులు అవసరం లేదనుకున్నారు. అంతే అయినవారికి పనులు అప్పగించేశారు.

పది మంది జేఈలు

కుప్పం లైనింగ్ పనులకు ఒకే డీఈ, ఒకే ఈఈకి అప్పగించడం, కేవలం నలుగురు జేఈలే ఉన్నారన్న అంశంపై ప్రాజెక్టు ఎస్ఈ విఠల్ ప్రసాద్ వివరణ ఇచ్చారు. పది మంది జేఈలు పని చేస్తున్నారని చెప్పారు. పనులను పర్యవేక్షిస్తున్నామని చెప్పుకొచ్చారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

విజయపురం : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 23వ తేదీ భూతగాద కారణంగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన వెంకటేశ్వరన్ (55) హత్య చేసిన కేసులో నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నగరి డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్ కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. తమిళనాడు తిరుత్తణి తాలూకా అరుంబాకం గ్రామానికి చెందిన వెంకటేశ్వరన్, అదే కాలనీకి చెందిన వెంకటేశన్‌కు గత 12 సంవత్సరాలుగా భూ తగాదా ఉంది. ఈ క్రమంలో ఈ నెల 23వ తేదీ వెంకటేషన్, తన ఇద్దరి కుమారులు ప్రభు, సేత పాతర్కాడు సమీపంలో కొబ్బరి తోట వద్ద వెంకటేశ్వరన్‌ను కత్తితో దాడి చేసి హత్య చేశారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు బుధవారం వెంకటేషన్‌ను అరెస్టు చేశారు. అతని ఇద్దరి కుమారులు పరారీలో ఉన్నారు. ఈ కేసు ఛేదించడంలో సహకరించిన సీఐ భాస్కర్, ఎస్ఐ రంగా, గోవిందరాజులు, సుబ్రమణ్యం, నరేష్, సత్యరాజ్, మణివల్లన్, అయ్యప్ప, శశికుమార్, దామోదరం, హరి, ప్రసాద్, లక్ష్మయ్యను డీఎస్పీ అభినందించారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న డీఎస్పీ, సీఐ, సిబ్బంది

అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

- రూ.10 లక్షలు విలువచేసే 8 ద్విచక్రవాహనాలు స్వాధీనం
- వివిధ పోలీస్ స్టేషన్లలో వీరిపై కేసులు
- రిమాండ్‌కు తరలింపు

నగరి: బైక్‌లను చోరీ చేస్తూ జల్సాగా తిరిగే ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను గురువారం నగరి పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.10 లక్షలు విలువైన 8 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నగరి డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. తమిళనాడు అరక్కోణం మోసూరు గ్రామానికి చెందిన పి.సిలంబరసన్ అలియాస్ అరసు (40), ఎస్.అరుళ్ (38) స్నేహితులు. వీరు జల్సాలకు అలవాటు పడి, ద్విచక్రవాహనాలను చోరీ చేసి అమ్మగా వచ్చే సొమ్ముతో విలాసంగా గడుపుతుండేవారు. ఈ క్రమంలోనే తమిళనాడులోను, రాష్ట్రంలోను పలు చోరీలకు పాల్పడ్డారు. నగరి పరిసర ప్రాంతాల్లో 4 నెలలుగా బైకుల చోరీలు పెరగడంతో ఇటీవల తమిళనాడు సరిహద్దులో వాహనాల రాకపోకలు రికార్డు అయ్యేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాత నేరస్తులపై నిఘా ఏర్పాటు చేశారు. వీరిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఇందులో భాగంగా గురువారం వేకువజామున అందిన సమాచారం మేరకు సీఐ విక్రమ్, ఎస్ఐ విజయ్‌నాయక్, క్రైం పార్టీ సిబ్బంది దేశమ్మ దేవాలయ ఆర్చి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా గత నాలుగు నెలలుగా నగరి, పుత్తూరు, నారాయణవనం, పరిసర ప్రాంతాల్లో మోటార్ సైకిళ్ల చోరీ, కార్ల అద్దాలు పగలగొట్టి సీడీ ప్లేయర్ల చోరీ చేసి తమిళనాడులోని తిరుత్తణి, కాంచీపురం పరిసర ప్రాంతాల్లో అమ్మినట్లు, కొన్ని వాహనాలు విజయపురం మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద దాచి ఉంచినట్లు తెలిపారు. నగరిలో 8, పుత్తూరులో 2, నారాయణవనంలో ఒకటి చొప్పున బైక్‌లు చోరీ చేయడంతో పాటు నగరి ఆర్డీఓ వినియోగించే ప్రభుత్వ వాహనపు అద్దాలు పగలగొట్టి ప్లేయర్ చోరీకి ప్రయత్నించినట్లు తెలిసింది. వారి వద్ద నుంచి సుమారు రూ.10 లక్షల విలువ చేసే 8 మోటార్‌సైకిళ్లను రికవరీ చేశారు. వీరిలో సిలంబరసన్ అలియాస్ అరసుపై తమిళనాడులో పలు పోలీస్ స్టేషన్లలో కేసులున్నాయి. వీరిని రిమాండ్‌కు పంపిన అనంతరం కస్టడీకి తీసుకొని ఇతర వాహనాలు, ఇతర వస్తువులు రికవరీ చేయనున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. నేరస్తులను పట్టుకోవడంతో ప్రతిభ కనబరచిన నగరి, కార్వేటినగరం సీఐలు విక్రమ్, హనుమంతప్ప, ఎస్ఐ విజయనాయక్, సిబ్బంది ఇంద్రకుమార్, సత్య, గజేంద్ర, అశోక్, లోకనాథం, గణేశ్ రెడ్డి, రమేషలను జిల్లా ఎస్పీ, నగరి డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. రివార్డులకు సిఫారసు చేశారు.

టీడీపీలో కుమ్ములాట

పాలసముద్రం : మండలంలోని తెలుగుదేశం గ్రామ స్థాయి కమటీల నియామకంలో గురువారం శ్రీకావేరిరాజుపురంలో జరిగిన కార్యక్రమంలో మండలంలో ఇరువర్గాలు కుమ్ములాడుకున్నాయి.. టీడీపీ పాలసముద్రం మండల అధ్యక్ష పదవికి మండలంలో నెల రోజులుగా ఎమ్మెల్యే, చిట్టిబాబు నాయుడు వర్గాల నడుమ విబేధాలు ఎక్కువయ్యాయి. పార్టీ మండల అధ్యక్ష పదవికి అధిష్ఠానం గ్రామస్థాయి కమిటీ నమోదు చేసుకుని, అందులో ఎక్కువ మంది ఎవరికి అమోదం తెలుపుతారో అతన్ని మండల అధ్యక్షుడిగా నియమించకోవచ్చని చెప్పడంతో మండంలో ఎమ్మెల్యే.. చిట్టిబాబు నాయుడు ఇరువర్గాలు గ్రామస్థాయి కమిటీ నియామకానికి కుమ్ములాడుకుంటున్నాయి. కమిటీ నమోదు చేయడానికి వచ్చిన అబ్జర్వర్లు కూడా నాయకులు చేస్తున్న గొడవలు చూసి గ్రామస్థాయి కమిటీలు నియామకం చేయకుండా పేరు నమోదు చేసుకుపోతున్నారు. మండలంలో ఎమ్మెల్యే ఎవరిని అమోదిస్తారో వారికే మండల అధ్యక్ష పదవి వస్తుందని టీడీపీ నాయకులే గుసగుసలాడుతున్నారు.

కొలమాసనపల్లి అడవిలో పేకాట

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి, గొల్లపల్లి అటవీప్రాంతంలో రహస్య ప్రదేశంలో పేకాట సాగుతోందని తెలిసింది. కొందరు అధికార పార్టీ అండతో పేకాటను నడిపిస్తున్నట్టు సమాచారం. అడవిలోని రహస్య ప్రదేశంలో స్థానికులే కాకుండా బయట రాష్ట్రాలకు చెందిన వారు సైతం వచ్చి ఇందులో పాల్గొంటున్నట్టు తెలిసింది. గతంలో ఇదే అడవిలో పేకాట ఆడుతుండగా స్థానిక పోలీసులు, స్పెషల్ బ్రాంచి సిబ్బంది మూకుమ్మడి దాడులు చేసి, పేకాటరాయుళ్లను పెద్దసంఖ్యలో అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషిస్తున్న ఓ వ్యక్తిపై ఎస్పీ పీడీ యాక్టు నమోదు చేసి జిల్లా బహిష్కరణ సైతం విధించారు. మళ్లీ కూటమి రాకతో ఓ పోలీసు కానిస్టేబుల్ సహకారంతో ఓ వ్యక్తి అడవిలో జూదం నడిపిస్తున్నట్టు తెలిసింది. ఇక్కడికి నిత్యం పెద్దసంఖ్యలో జూదగాళ్లు బైకులపై వచ్చి వాటిని రహస్యంగా దాచి అక్కడి నుంచి కాలినడకన వెళ్లి ఆటలో పాల్గొంటున్నారని సమాచారం. ఈ అడవిలోకి వెళ్లే మార్గంలో ఎవరు లోనికొస్తున్నారని తెలుసుకొని సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా ఇరువురు ఏజెంట్లు ఉన్నట్టు తెలిసింది. వీరు ఈలలు వేయడం, సెల్‌ఫోన్ ద్వారా మెసేజ్ లివ్వడం ద్వారా జూదగాళ్లకు వద్దకు ఎవరూ వెళ్లకుండా కాపుగాస్తున్నట్టు తెలుస్తోంది. దీనిపై జిల్లా అధికారులైనా నిఘా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు చెబుతున్నారు.

గురుకుల టీచర్లకు బదిలీలు నిర్వహించాలి



డీసీఓ పద్మజను సత్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న టీజీటీ, పీజీటీలకు బదిలీలు నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం కోరారు. ఆ సంఘ నాయకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ పద్మజను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గురుకులాల్లో కాంట్రాక్ట్ లెక్చరర్లుగా, టీచర్లుగా విధులు నిర్వహిస్తున్న వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎన్నో సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న వారందరినీ ప్రభుత్వం రెగ్యులర్ చేయాలన్నారు. గురుకుల పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్లకు సకాలంలో జీతాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీఆర్‌జేసీ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ టీచర్లకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలన్నారు. ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా డా.బీఆర్ అంబేడ్కర్ చిత్రపటం ప్రదర్శించాలన్నారు. ఆరో తరగతి పాఠ్యాంశాల్లో అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలన్నారు. అనంతరం ఆ సంఘ నాయకులు డీసీఓను శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు మురళి, భాస్కర్, షణ్ముగం, పొన్నయ్య, సంతానం తదితరులు పాల్గొన్నారు.

ఆఖరి మజిలీలో మళ్లీ కష్టాలు!

పుత్తూరు: పట్టణంలోని హరిశ్చంద్ర శ్మశాన వాటికలో ప్రజలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. గత ఏడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.151 కోట్ల వ్యయంతో నాటి పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పుత్తూరు పట్టణానికి అత్యాధునిక గ్యాస్ ఆధారిత శవ దహనవాటిక (ఎలక్ట్రికల్ క్రమటోరియం షెడ్డు)ను ఏర్పాటు చేయించారు. శ్మశాన వాటిక మధ్యలో రోజా చారిటబుల్ ట్రస్ట్‌చే ముక్తి ప్రదాత శివుని భారీ విగ్రహాన్ని సైతం ఏర్పాటు చేశారు. దీనికి దక్షిణ కైలాస ముక్తిధామం అని నామకరణం చేశారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది తిరక్క ముందే రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన క్రమటోరియం మిషన్లు పాడై పోయాయని షెడ్‌కు తాళాలు వేశారు. దీంతో మృతదేహాలను మళ్లీ పిడకలపై కాల్చే పాత పద్ధతికి శ్రీకారం చుట్టినట్లైంది. పాడైన విషయం తెలియని ప్రజలు మృతదేహాలతో శ్మశాన వాటికలోకి వచ్చేస్తున్నారు. తీరా ఇక్కడి వచ్చిన తర్వాత విషయం తెలుసుకుని అప్పుడు పిడకల కోసం వెతుకులాట ప్రారంభిస్తున్నారు. గొయ్యి తీసి పూడ్చేందుకు మనుషులు దొరక్క ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ తంతు గత నెల రోజులుగా జరుగుతున్నా మున్సిపల్ అధికారులు ఎలక్ట్రికల్ క్రమటోరియం మిషన్లు మరమ్మతు చేయించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేసి ఎలక్ట్రికల్ క్రియేషన్ షెడ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



మూతపడిన క్రమటోరియం షెడ్



పిడకలపై కాలుతున్న మృతదేహం

త్వరలో మరమ్మతులు పూర్తి చేస్తాం

ఎలక్ట్రికల్ క్రమటోరియం షెడ్‌లో ఓ మోటారుతో పాటు రెండు సెన్సార్లు పనిచేయడం లేదు. వీటిని చెన్నైకి చెందిన కంపెనీ వారు ఏర్పాటు చేశారు. అదే కంపెనీ వారిని మరమ్మతులకు పిలిచాం. రెండు రోజుల్లో వస్తామని చెప్పి ఉన్నారు. వారు వచ్చిన వెంటనే మరమ్మతులు పూర్తి చేసి, షెడ్‌ను వినియోగంలోకి తీసుకొస్తాం.

– ఎం.మంజునాథ్‌గౌడ్, కమిషనర్, పుత్తూరు మున్సిపాలిటీ

ఉద్యోగం పేరుతో నిరుద్యోగులకు టోకరా

- యువకుడి అరెస్టు

పెనుమూరు(కార్వేటినగరం) : ఉద్యోగం పేరుతో నిరుద్యోగులను మోసం చేసి ఆన్‌లైన్‌లో నగదు వసూలు చేసిన సంఘటన పెనుమూరు మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రామచంద్రయ్య కథనం మేరకు .. సోమల మండలం తోప్పన్నగారి పల్లికు చెందిన కృష్ణమూర్తి కుమారుడు బోను పవన్ (25) జల్సాలకు అలవాటు పడి నిరుద్యోగ యువతకు ఫోన్లు చేసి, వారికి ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి వారి వద్ద నుంచి ఆన్‌లైన్‌లో డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం అందడంతో అతడిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం చిత్తూరు మెజిస్ట్రేట్ ముందు హాజరు హాజరు పరిచినట్లు తెలిపారు. అతను పెనుమూరు మండలమే కాకుండా గంగాధర నెల్లూరు, వెదురుకుప్పం మండలాల్లో కూడా ఇలాంటి మోసాలకు పాల్పడినట్లు ఆయన వెల్లడించారు.

జూలై 5న కృత్రిమ కాళ్ల కొలతల క్యాంప్

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని దివ్యాంగులకు జూలై 5వ తేదీన కృత్రిమ కాళ్ల కొలతల క్యాంప్ నిర్వహించనున్నట్లు విభిన్నప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిత్తూరులోని తపోవనం పాఠశాలలో కృత్రిమ కాళ్ల క్యాంప్ నిర్వహించి, కొలతలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈక్యాంప్‌ను కొత్తగా కృత్రిమ కాళ్లు అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ క్యాంప్ నిర్వహించిన 20 రోజుల తర్వాత ఉచితంగా ఆధునిక కృత్రిమ కాళ్లను అమర్చడం జరుగుతుందన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సదరం సర్టిఫికెట్, వైకల్యం కనిపించేలా రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, ఫోన్ నంబర్‌తో విచ్చేయాలన్నారు. ఇతర సందేహాలకు 9440357522, 6281486722 నెంబర్‌లలో సంప్రదించాలని ఏడీ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మృతి



ప్రకాష్(ఫైల్)

ఐరాల: రోడ్డు ప్రమాదంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన మండలంలోని ఎం.పైపల్లె వద్ద గురువారం చోటు చేసుకుంది. కాణిపాకం ఇన్‌చార్జి ఎస్ఐ చిరంజీవి కథనం మేరకు.. మండలంలోని మామిడిగుంట్లపల్లెకు చెందిన ఏ.ప్రకాష్(42) కాణిపాకం ఆలయంలో ఔట్ సోర్సింగ్ హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఉదయం స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంలో చిత్తూరుకు సొంత పనుల నిమిత్తం బయలుదేరాడు. మండలంలోని చిన్నవెంకటంపల్లెకు చెందిన నరసింహారెడ్డి ఓ కారులో చిత్తూరు నుంచి ఐరాల వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో నరసింహారెడ్డి అతివేగంగా కారు నడుపుతూ ఎం.పైపల్లె వద్ద ద్విచక్రవాహనంలో వెళుతున్న ప్రకాష్‌ను కారుతో ఢీకొన్ని, వెనుక వస్తున్న ఆటోను ఢీకొన్ని కొంత దూరం కారుతో లాక్కొని వెళ్లి ఓ చెట్టుకు ఢీకొట్టడంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జయ్యింది. ఈ ఘటనలో ప్రకాష్ తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే ఆటోలో ఉన్న మండలానికి చెందిన జుబేరా కూడా గాయపడ్డాడు. క్షతగాత్రులను ఓ ప్రైవేటు వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రకాష్‌ను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రస్తుతం జుబేరా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోస్టుమార్టమ్ అనంతరం ప్రకాష్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి మురగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రకాష్ మృతికి కాణిపాకం ఆలయ సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మత్తు వదలాలి.. భవిష్యత్ మారాలి



ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ తదితరులు



మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ చందోలు

- కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ
- చిత్తూరులో మాదక ద్రవ్యాల నివారణపై ర్యాలీ

చిత్తూరు అర్బన్: యువత మత్తు వదిలి.. భవిష్యత్ బంగారు బాట పట్టేలా అడుగులు వేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి భారతి పిలుపునిచ్చారు. చిత్తూరు నగరంలో గురువారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం-అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా గాంధీ విగ్రహం నుంచి దర్గా సర్కిల్, చర్చివీధి మీదుగా ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ యువత మత్తుకు బానిసలైతే జీవితం చిత్తవుతుందన్నారు. గంజాయి జోలికి వెళ్లి జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. అధికారులు సైతం క్షేత్రస్థాయిలో అవగాహన తీసుకోవాలన్నారు. మత్తు వదిలేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్మన్ కఠారి హేమలత, డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.